# క్రమబద్ధీకరణకు మరో చాన్స్

- జీఓ 58, 59 కింద ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల స్వీకరణ
- ఈనెల 30వరకు అవకాశం

**మహబూబ్‌నగర్ రూరల్/ జడ్చర్ల టౌన్:** ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న వారి స్థలాలను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2015లో జీఓ నంబర్ 58, 59 తీసుకవచ్చింది. జీఓ 58 ద్వారా 125 గజాల వరకు స్థలం గల వారి నుంచి ఎలాంటి రుసుం తీసుకోకుండా ఉచితంగా క్రమబద్ధీకరణ కోసం అవకాశం కల్పించింది. జీఓ 59 ద్వారా 125 గజాల నుంచి 1000 గజాల వరకు స్థలాలను ఆక్రమించుకున్న వారి నుంచి తగిన రుసుం తీసుకుని క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. 2014 జూన్ 2వ తేదీ నాటికి ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నట్లుగా ఆధారాలతో దరఖాస్తు చేసుకున్న వాళ్లకు క్రమబద్ధీకరించారు. 2015లో ఒకసారి, 2020లో, 2022లో మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించి భూములను క్రమబద్ధీకరించారు. గతంలో 2014 జూన్ 2కు ముందు స్వాధీనంలో ఉన్న వారికే క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పిన ప్రభుత్వం, తాజాగా 2020 జూన్ 2కు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఇందుకు అర్జీల స్వీకరణ ఏప్రిల్ 1నుంచి ప్రారంభమైంది. ఈనెల 30వ తేదీ వరకు కొనసాగనుంది. అయితే తాజాగా వెలువడిన 58, 59 జీఓల ప్రకారం ఎలా దరఖాస్తు చేసుకోవాలి. ఏ పత్రాలు జత చేయాలి అనే దానిపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. వీటిని నివృత్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**జీఓ 58 ప్రకారం..**

☛ 125 చదరపు గజాలు 58 జీఓ కేవలం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) వారికి మాత్రమే వర్తిస్తోంది.

☛ ఎలాంటి రుసుం ప్రభుత్వానికి చెల్లించనవసరం లేదు. ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు.

☛ 150 గజాలు ఉంటే నామమాత్రపు రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

**జీఓ 59 ఇలా..**

☛ ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఇంటిని క్రమబద్ధీకరించుకోవచ్చు.

☛ ఉచిత క్రమబద్ధీకరణ ఉండదు.

☛ లబ్ధిదారులు ప్రభుత్వం సూచించిన మార్కెట్ విలువ ప్రకారం నోటిఫైడ్ స్లమ్స్‌లో 10 శాతం, ఇతర ప్రాంతాల్లో 25 శాతం ఆపై రుసుం డీడీ రూపంలో గడువులోగా చెల్లించాల్సి ఉంటుంది.

☛ 250 గజాల్లోపు ఉంటే 25 శాతం, 500 గజాల్లోపు 50, 1000 గజాల్లోపు 75 శాతం, 1000 గజాలపైన ఉంటే రిజిస్ట్రేషన్ విలువ పూర్తిగా చెల్లించాలి.

**దరఖాస్తు ఇలా..**

స్థలాలను క్రమబద్ధీకరణ చేయించుకునే వారు విద్యుత్, తాగునీరు, నివాస ధ్రువీకరణ పత్రం, ఆస్తి పన్ను రశీదు, ఆధార్‌కార్డు దరఖాస్తుతో పాటు జతచేయాలి. మీ–సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఏదిఏమైనా పేద, మధ్యతరగతి ప్రజల స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో బీఆర్‌ఎస్ పార్టీకి రాజకీయంగా లబ్ధి చేకూరనున్నది.



కావేరమ్మపేట వ్యూ

### 3వేల ఇళ్లకు..

ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణతో మున్సిపాలిటీ పరిధిలోని జడ్చర్ల, కావేరమ్మపేట వాసులకు ఎంతో మేలు కలగనుంది. బాదేపల్లి పట్టణంలో ఇదివరకే ఇళ్లను జియో ట్యాగింగ్ చేశారు. ట్యాగింగ్ ఆధారంగా అన్ని ఇళ్లకు అసెస్‌మెంట్ నెంబరు కేటాయించారు. జడ్చర్ల, కావేరమ్మపేట గ్రామాలు మున్సిపాలిటీలో 2018లో విలీనం కావటంతో జియో ట్యాగింగ్ చేయలేదు. ఈ కారణంగా ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఇళ్లకు ఎలాంటి పత్రాలు లేవు. కావేరమ్మపేట గ్రామం మొత్తం, జడ్చర్లలోని కుమ్మరివాడ, వెంకటేశ్వరకాలనిలోని ఇళ్లన్నీ ప్రభుత్వ స్థలంలోనే ఉన్నాయి. కొందరికి ఇంటి నెంబర్లు కేటాయించి పన్ను వసూలు చేస్తున్నారు. ప్రతినెలా కరెంట్ బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారు. అయినప్పటికీ ఇతరుల పేర్లపైకి బదిలీ చేసే ఆస్కారం లేకుండా పోయింది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అసెస్‌మెంట్ నంబరు ఉంటేనే పేర్ల బదిలీ చేస్తున్నారు. ఈ కారణంగా ప్రభుత్వం ప్రకటించిన క్రమబద్ధీకరణ నిర్ణయం రెండు గ్రామాల్లో 3వేలకుపైగా ఇళ్లకు మేలు చేకూరనుంది.

### 48 గంటల్లో రిజిస్ట్రేషన్ చేస్తాం



జీఓ 59 కింద ప్రభుత్వానికి రుసుం చెల్లించిన 48గంటల్లో రిజిస్ట్రేషన్ చేసి ఇస్తాం. దరఖాస్తుతో పాటు అన్ని పత్రాలు సమర్పించాలి. విచారణలో ఆధారాలు సమర్పించి సహకరించాలి.

– బి.పార్థసారథి, తహసీల్దార్, మహబూబ్‌నగర్ అర్బన్

### 40ఏళ్లుగా నివాసం ఉంటున్న..



కావేరమ్మపేటలో 40ఏళ్లకు పైగా నివాసం ఉంటున్నాం. అయినప్పటికీ ఎలాంటి ధ్రువపత్రాలు లేవు. ఇంటిపన్ను, కరెంట్ బిల్లు చెల్లిస్తూనే ఉన్నాం. పోర్టల్ 58లో ఉచితంగానే క్రమబద్ధీకరించుకునేందుకు ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం.

– వి.శివగౌడ్, కావేరమ్మపేట

### నిరుపేదలకు వరం..



ప్రభుత్వం ఇంటిస్థలాల క్రమబద్ధీకరణ నిర్ణయం నిరుపేదలకు వరం. 125 గజాలలోపు ఉన్న వారందరికీ ఉచితంగానే క్రమబద్ధీకరణ చేస్తున్నందునా అవగాహన కల్పిస్తాం. కావేరమ్మపేట, జడ్చర్ల, బాదేపల్లి పాతబజార్ ప్రాంతంలో క్రమబద్ధీకరణకు అవకాశం ఉంది.

– దోరేపల్లి లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, జడ్చర్ల

# అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** మనిషికి నాగరికత నేర్పింది దర్జీలేనని, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బండమీదిపల్లిలోని రెడ్డి హాస్టల్ సమీపంలో రూ.20లక్షలతో నిర్మించే మేరు సంఘం కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐటీ పార్కులో పెద్ద పరిశ్రమలు రాబోతున్నాయని, వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

**ఏకలవ్య కాలనీలో పర్యటన..**

అంతకుముందు ఏకలవ్య కాలనీలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే నీటిట్యాంకు నిర్మించాలని, రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, హైమాస్ట్ లైట్లు వేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తాగునీటి పైపులైన్‌ను పగులగొట్టిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సీసీరోడ్డు నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్, కౌన్సిలర్లు కట్టా రవికిషన్‌రెడ్డి, లక్ష్మీదేవి, అనంతరెడ్డి, మేరు సంఘం జిల్లా అధ్యక్షుడు కీర్తి నరేందర్, ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాసులు, కోశాధికారి ఎ.వివేకానంద్ పాల్గొన్నారు.



మేరు సంఘం కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# రమణీయం.. రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

**మహబూబ్‌నగర్ రూరల్:** మండలంలోని ధర్మాపూర్‌లో కపిలాద్రి రుక్మిణి పాండురంగస్వామి రథోత్సవం గురువారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో రుక్మిణి పాండురంగస్వామి దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగించారు. గర్భగుడి నుంచి సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేద మంత్రాల మధ్య దేవస్థానం ఆవరణలోని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయం చుట్టూ ఎద్దుల బండ్లు, వాహనాల ఊరేగింపు ఉత్సాహంగా కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వెంకటరమణయ్య, ఎంపీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్వ బాల్‌రెడ్డి, వి.బాల్‌రెడ్డి, యాదయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

**వీరభద్రస్వామి రథోత్సవం..**

**కోయిల్‌కొండ:** మండలంలో ప్రసిద్ధి చెందిన వీరభద్రక్షేత్రంలో శుక్రవారం తెల్లవారుజామున బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు గురువారం రాత్రి నుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నందికోళ్ల సేవతో నిర్వహించారు. అనంతరం భక్తులు రథాన్ని ఊరేగించారు. భక్తులకు మరికల్ మండలానికి చెందిన శివకుమార్ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

# చందా కోసం వెళితే కండువా కప్పారు



పోతన్‌పల్లి కాంగ్రెస్ నాయకులతో సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్‌నగర్ రూరల్:** మండలంలోని పోతన్‌పల్లికి చెందిన తమ పార్టీ నాయకులు ఎవరూ కూడా బీఆర్‌ఎస్‌లో చేరలేదని టీపీసీసీ కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు చందా కోసం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసేందుకు వెళ్లిన తమ పార్టీ నాయకులకు బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలో చేరినట్లుగా ప్రచారం చేసుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితుల్లో ప్రజలెవరూ లేరని తెలిపారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, లిక్కర్ కుంభకోణాల్లో తలమునకలై ఉన్న బీఆర్‌ఎస్ రాబోయే ఎన్నికల్లో ఘోరంగా అపజయం పాలవుతుందని జోస్యం చెప్పారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రమేష్, మాజీ కౌన్సిలర్ నాగరాజుయాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, హన్వాడ మండల అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ సర్పంచ్‌లు మాధవరెడ్డి, గోవింద్‌యాదవ్, నాయకులు సుభాష్ ఖత్రి, జగదీశ్వర్, మైబు, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం

**చిన్నచింతకుంట:** మండలంలోని దమగ్నాపూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు హాథ్ సే హాథ్ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ అనిల్‌కుమార్ రెడ్డి, బుచ్చిరెడ్డి, బ్రహ్మయ్య, చిన్నన్నగౌడ్, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దమగ్నాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# కుట్రపూరిత రాజకీయాలు మానుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**కోయిల్‌కొండ:** సీఎం కేసీఆర్ కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఖాజీపూర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్‌కు బెయిల్ రావడంపై గ్రామ అధ్యక్షుడు కృష్ణకుమార్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ కేశవ్‌యాదవ్, తిరుమలేష్, వెంకటేష్, శ్రీకాంత్, చెన్నయ్య, కృష్ణప్రభ, నాగరాజ్, మహేష్, రాజు, బాలకృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యంతోనే పేపర్ లీక్‌లు



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

**చిన్నచింతకుంట:** ప్రభుత్వం వైఫల్యంతోనే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలు జరుగుతున్నాయని వైఎస్‌ఆర్ టీపీ జిల్లా అధ్యక్షుడు, దేవరకద్ర నియోజకవర్గ కో–ఆర్డినేటర్ మందాడి సరోజ్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణను సాధించుకోగా, అవేవీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం లక్షా 91వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసి పకడ్బందీగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ టీపీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు కాత్రావత్ ఆనంద్, జహంగీర్, యాదయ్య, శివ, నయీమ్, యాదగిరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**నవాబుపేట:** పేపర్ లీకేజీ వ్యవహారంలో వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మరియమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తీగలపల్లిలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ నాయకులు శ్యామూల్, శేఖర్, బాల్‌రాజ్, నవీన్, శ్రీనివాస్, చెన్నయ్య, శంకర్, యాదయ్య, ఆశన్న ఉన్నారు.

# ప్రభుత్వ శాఖల్లో ఉర్దూను అమలు చేయాలి

**స్టేషన్ మహబూబ్‌నగర్:** అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉర్దూ భాషను అమలు చేయాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా కోరారు. మొదటి ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేసి 100ఏళ్లు పూర్తయిన సందర్భంగా అల్‌ఫైజ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా మాట్లాడుతూ మొదటి ఉర్దూ యూనివర్సిటీగా ఉస్మానియా విశ్వవిద్యాలయానికి గుర్తింపు ఉందన్నారు. ఉర్దూ భాషకు గణనీయమైన చరిత్ర ఉందని, ఉర్దూభాషాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటుపడాలని కోరారు. ఉర్దూభాషను అధికారికంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాఖూబ్, షేక్ మహమూద్, మహ్మద్ షుకూర్, యూసుఫ్, ఖాజా అలీ బేగ్, షేక్ అక్బర్, రిజ్వాన్, సూఫియాన్ తదితరులు పాల్గొన్నారు.

# పాప విముక్తి కోసమే ఏసు ప్రాణత్యాగం



జిల్లా కేంద్రంలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

**స్టేషన్ మహబూబ్‌నగర్:** పాపంలో కూరుకుపోయిన మానవాళి కోసం యేసుక్రీస్తు శిలువ త్యాగం చేశారని పాస్టర్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని కల్వరిఎంబీ చర్చి, షాలేము, క్రిస్టియన్‌పల్లిలోని బెత్లహం, క్రిస్టియన్ కాలనీలోని ఎంబీ ప్రేయర్, మోతీనగర్ బెతస్థ చర్చితో పాటు ఇతర చర్చిల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్లు క్రీస్తు సందేశం ఇచ్చారు. బైబిల్ సూక్తులను చదివి వినిపించారు. దేవుడి దృష్టిలో అందరూ సమానులేనని అన్నారు. క్రీస్తు ప్రభువు శిలువపై పలికిన ఏడు మాటల గురించి వివరించారు. కల్వరి ఎంబీ చర్చిలో చైర్మన్, సీనియర్ పాస్టర్ రెవరెండ్ వరప్రసాద్ క్రీస్తు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జేఐ యోహాన్, కార్యదర్శి శామ్యుల్ తదితరులు పాల్గొన్నారు.

**రెమా వర్షిప్ సెంటర్‌లో..**

స్థానిక రెమా వర్షిప్ సెంటర్‌లో పాస్టర్ బీఎస్ పరంజ్యోతి ప్రార్థనలు నిర్వహించారు. యేసుక్రీస్తు త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని ఆయనకు సాక్షులుగా రాణించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బెంగుళూర్‌కు చెందిన పాస్టర్ జోయెల్ బాబు, పాస్టర్ నాగరాజు, దేవయ్య, రామాంజనేయులు, శ్యామ్, ప్రెయిజీరాణి, బ్లాండీనా, మహిమ, మార్త పాల్గొన్నారు.

**జడ్చర్ల టౌన్:** మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. బేథాని ఎంబీ చర్చిలో బెంజిమెన్ ఆధ్వర్యంలో ఉపవాస ప్రార్థనలు చేశారు. క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను వినిపించారు. తండ్రి వీరేమిచేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుము అనే మొదటి మాటను అధ్యక్షుడు బెంజిమెన్, రెండవ మాట నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువు దేవదానం వినిపించారు. మూడవ మాట అమ్మా ఇదిగో నీ కుమారుడు, సహోదరుడా ఇదిగో నీ తల్లి అని తిమోతి వినిపంచగా, నాలుగవ మాట నాదేవా నన్నెందుకు చేయి విడిచితివి అంటూ సుందర్‌పాల్, ఐదో మాట నేను దప్పిగొనుచున్నా అంటూ మైఖేల్ మనోహర్, ఆరవమాట సమాప్తమైనది దానియేల్, చివరి మాటను రెవరెంట్ విలియంబూత్ తండ్రి నీచేతికి నా ఆత్మను అప్పగించుచున్నాను అంటూ వినిపించారు. విలియంబూత్ ఆశీర్వాదంతో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు ముగించారు. మండలంలోని కొండేడ్ ఎంబీ చర్చిలో నిర్వహించిన ఉపవాస ప్రార్థనల్లో పాస్టర్ స్టీవెన్‌రాజు సందేశమిచ్చారు. ఈర్షద్వేశాలు, అసూయ తొలగించుకుని మానవాళిపై ఏసు క్రీస్తు చూపిన ప్రేమ, శాంతితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.




మాట్లాడుతున్న పాస్టర్ వరప్రసాద్



కొండేడ్‌లో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

# వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

**జడ్చర్ల:** పల్లెపల్లెకు ఓబీసీ మోర్చ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణాలో బీసీలు రాజకీయంగా ఎదుగకుండా అణగదొక్కుతున్నారని అన్నారు. జీ హెచ్‌ఎంసీ ఎన్నికల్లో ముస్లింలను కూడా బీసీలుగా గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వడంతో బీసీలు చాలామంది అవకాశం కోల్పోయారని అన్నారు. 50శాతం ఉన్న బీసీ విద్యార్థులకు 261 గురుకులా లు ఉండగా, 12శాతం మాత్రమే ఉన్న మైనార్టీలకు 192 గురుకులాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యాదర్శి రాజు, పట్టణ అధ్యక్షుడు అనంతకిషన్, నాయకులు మహేంద్రచారి, శేఖర్‌గౌడ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

# ఇఫ్తార్



**మిడ్జిల్:** మండల కేంద్రంలోని ఎంవీఎస్ గార్డెన్‌లో శుక్రవారం ముస్లింలకు టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్ రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు పండ్లు తినిపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, సంపత్, గౌస్, వెంకటేష, చంద్రమౌళి, జహంగీర్, జహీర్, నిస్సార్, హకీం తదితరులు పాల్గొన్నారు.

**దేవరకద్ర:** మండల కేంద్రంలోని జామా మసీదులో శుక్రవారం సాయంత్రం రంజాన్ ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు జాకీర్, ఖదీర్, షరీఫ్, గౌస్, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రాజు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వీరశైవ సంఘం కమిటీ ఎన్నిక



జిల్లా వీరశైవ జంగమ అర్చక పురోహిత సంఘం కొత్త కార్యవర్గం

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక పాతూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం జిల్లా వీరశైవ జంగమ అర్చక పురోహిత సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.సురేష్‌కుమార్ (కన్మనూర్), ప్రధాన కార్యదర్శిగా ఆలంపల్లి మల్లేష్ (మహబూబ్‌నగర్), కోశాధికారిగా పరమేష్, ఉపాధ్యక్షులుగా గణాచారి, పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా నందీశ్వర్ (కొల్లూరు), వీరన్న (లోకిరేవు), సలహాదారులుగా గోపన్‌పల్లి సురేష్ (కొల్లూరు), ఆగమ సలహాదారులుగా మిఠాయి విజయ్, జగదీశ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ సమాజ సేవలో ముందుంటామన్నారు. సంఘం అభివృద్ధితో పాటు విద్యార్థుల ఉన్నతి కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సర్వేశ్వర్, వినోద్, పండితారాధ్య రాము, శివరాజ్, అరుణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక రీచ్‌ల పరిశీలన

**అడ్డాకుల:** మండలంలోని ఇసుక రీచ్‌లను శుక్రవారం తహసీల్దార్ కిషన్ పరిశీలించారు. మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ పనులకు ఇసుక అవసరాలను తీర్చేందుకు మన ఇసుక–మన వాహనం కోసం కందూర్, పొన్నకల్ శివారులోని పెద్దవాగును అధికారులు పరిశీలించారు. వాగులో ఇసుక లభ్యత ఉన్న ప్రదేశాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అదేవిధంగా వాగులోకి వాహనాలు వెళ్లే దారులను చూశారు. గురువారం మండల సర్వసభ్య సమావేశంలో స్థానిక అవసరాలకు ఇసుక తరలించుకునేలా ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలని కందూర్ సర్పంచ్ శ్రీకాంత్ విజ్ఞప్తి చేయడంతో అధికారులు వాగును పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్ర శ్రీనివాస్, కందూర్ సర్పంచ్ వి.శ్రీకాంత్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, స్థానికులు తోకల దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.



కందూర్ వద్ద వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ కిషన్

## క్లుప్తంగా

### స్వచ్ఛభారత్

**జడ్చర్ల టౌన్:** బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కావేరమ్మపేటలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు పి.నరేష్, ప్రధాన కార్యదర్శి భరత్‌గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

### గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలి

**కోయిల్‌కొండ:** గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని మండల జేఏసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం 75వ రోజు చేపడుతున్న రిలేదీక్షల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు ఈ రిలేదీక్షలు ఆపేది లేదన్నారు. గార్లపహాడ్ చుట్టుపక్కల ఉన్న 15గ్రామాల ప్రజలు మండలంగా ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

### దాసర్‌పల్లిలో అన్నదానం

**అడ్డాకుల:** మూసాపేట మండలంలోని దాసర్‌పల్లిలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శుక్రవారం అన్నదానం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సిములు ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, జయన్నగౌడ్, లక్ష్మీనారాయణ, కృష్ణారెడ్డి, రాము తదితరులు ఉన్నారు.

### బాధితులకు పరామర్శ



**అడ్డాకుల:** మూసాపేట మండలంలోని దాసర్‌పల్లి, నిజాలాపూర్ గ్రామాలకు చెందిన ఇద్దరు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధితులను ఆస్పత్రిలో పరామర్శించారు. దాసర్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రఘు, నిజాలాపూర్‌కు చెందిన యువకుడు రేమోద్దుల అరవింద్‌లను పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అదేవిధంగా చికిత్స పొందుతున్న పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రఘుకు ఆర్థికసాయం అందించారు.

### బలగం సినిమా ప్రదర్శన

**బాలానగర్:** కుటుంబం, బంధుత్వం, ప్రేమ, ఆప్యాయతల నేపథ్యంతో ఉన్న బలగం సినిమాను మండల కేంద్రంలో సర్పంచ్ విజయలక్ష్మి, తిరుపతి బలగం సినిమాను ప్రదర్శన చేయించారు. అలాగే మండలంలోని గుండేడ్‌లో మాజీ సర్పంచ్ జయమాల, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బలగం సినిమాను ప్రదర్శింపజేశారు.

### మంత్రికి కృతజ్ఞతలు



**స్టేషన్ మహబూబ్‌నగర్:** పాలమూరు రెడ్డి సేవా సమితి బాలుర వసతి గృహ సముదాయానికి సీసీ రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇప్పించి రోడ్డును పూర్తి చేయించిన సందర్భంగా సమితి ప్రతినిధులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లు నర్సింహారెడ్డి, కోశాధికారి రాజేందర్‌రెడ్డి, పి.లక్ష్మారెడ్డి, కార్యదర్శి జి.వెంకట్రాంరెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వాసవీమాతకు పూజలు

**దేవరకద్ర:** మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించి లలితా పారాయణం చేశారు. అనంతరం అమ్మవారి పల్లకీసేవను నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కల్వ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ సీజ్

**నవాబుపేట:** మండలంలోని రుద్రారం సమీపంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. శుక్రవారం రుద్రారం సమీపంలో మహబూబ్‌నగర్ మండలం పత్తేపూర్‌కు చెందిన వ్యక్తి మధుగౌడ్ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా, పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

### ఒకరికి గాయాలు

**అడ్డాకుల:** మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని కందూర్ అనుబంధ గ్రామమైన వద్దేపల్లికి చెందిన వడ్డె దశరథం తన ద్విచక్రవాహనంపై శుక్రవారం మధ్యాహ్నం కొత్తకోటకు వెళ్తున్నాడు. అడ్డాకుల దాటిన తర్వాత స్నేహ చికెన్ పరిశ్రమ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దశరథంకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఎల్అండ్‌టీ అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స నిర్వహించి జిల్లా కేంద్రానికి తరలించారు.